వినతిపత్రం స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

కదిరిలో కలకలం..!

◆ యువతిపై ఖాకీల అసభ్య ప్రవర్తన.? ◆ ఫిర్యాదు చేసిన బాధితురాలు

కదిరిలో కలకలం రేగింది. రక్షణగా ఉండాల్సిన పోలీసులే ఓ యువతి పట్ల అసభ్య ప్రవర్తనకు పాల్పడినట్లు తెలుస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం చక్కర్లు కొట్టడంతో పోలీసు శాఖ అప్రమత్తం అయ్యింది. కేసుకు సంబంధించి పూర్వాపరాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. కాగ ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇంకా విచారణ చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని మీడియాకు తెలియజేశారు. రాత్రి సమయంలో తన తల్లికి మాత్రలు తీసుకుని వచ్చేందుకు వెళ్తున్న తనపై ఓ పోలీసు అసభ్యంగా ప్రవర్తించాడంటూ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వార్త మెయిన్‌లో



వేడుకగా గణతంత్ర దినోత్సవం

◆ 25 లోగా ఏర్పాట్లు పూర్తి చేయండి ◆ జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

74వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఈ నెల 25వ తేదీ సాయంత్రంలోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన స్పందన కార్యక్రమం అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ శకటాలు నిర్మాణం ఏ మేరకు వచ్చిందో సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పరిమిత సంఖ్యలో ఉండేలా చూసుకోవాలని సర్వశిక్ష అభియాన్, విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక విషయంలోనూ ప్రమాణాలు పాటించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలన్నారు. ఇక స్పందన కార్యక్రమానికి సంబంధించి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు 418 అర్జీలను అందజేశారని ఆయా శాఖల అధికారులు వీటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. మొక్కుబడి సమాధానాలు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీదారుడితో విచారణ అధికారి ఫోటో తప్పనిసరిగా అప్ లోడ్ చేయాలన్నారు. అర్జీలకు కింది స్థాయి ఉద్యోగులు ఇచ్చే సమాధానాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. రీఓపెన్ అయ్యే అర్జీలలో గతంలో విచారణ చేసిన అధికారి కంటే ఉన్నత అధికారి విచారణ చేపట్టాలనే నిబంధన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆన్సెట్ సీఈవో కేశవ నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎం.విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ఆర్‌జియుకెటి విసి విజయకుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు రెక్టార్‌గా విధులు నిర్వహించి రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.విజయకుమార్‌ను జెఎన్‌టియు ఉపకులపతి రంగజార్ధన అధ్వర్యంలో సోమవారం వర్సిటీ పరిపాలన భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విసి రంగజర్ధన మాట్లాడుతూ విజయకుమార్ సౌమ్యుడిగా, మృదుస్వభావిగా, ముక్కు సూటి మనిషిగా, నిగర్వీగా పని చేసి సిబ్బంది, విద్యార్థుల మన్ననలు పొందారన్నారు. అంతేస్థాయితో పని చేసి ఆర్‌జియుకెటిని కూడా ఉన్నత పథంలో నడిపిస్తారని ఆకాంక్షించారు. విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి ఇన్‌ఛార్జి ఉపకులపతి బాధ్యతను అప్పగించడం పట్ల సంతోషకమరమన్నారు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, పి.ఆర్.భానుమూర్తి, ఇ.కేశవరెడ్డి, వి.సుమలత, కిరణ్మయి, బి.ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌బాబు, అరుణకాంతి, భువనవిజయ, పద్మ సువర్ణ, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, వర్సిటీ పిఆర్‌ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు వినియోగిస్తే జరిమానా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ ఫ్లెక్సీలను తయారుచేసినా, వినియోగించినా చర్యలు తప్పవని అదనపు కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని అడ్వర్టైజ్మెంట్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ఉత్పత్తి చేసినా, దిగుమతి చేసుకున్నా.. ముద్రించడం, ఉపయోగించినా, ప్రదర్శించినా జనవరి 26వ తేదీ నుండి ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.వంద జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తూ నగరంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈసమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్రాబు, పట్టణ ప్రణాళికా విభాగము ఎసిపిలు పి.శ్రీనివాసులు, కె.సువర్ణ, టిపిఎస్ కె.మహబూబ్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు మురళి, దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

రహదారి భద్రతపై అవగాహన అవసరం

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం ద్వారానే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. సోమవారం స్థానిక జెఎన్‌టియులోని పరిపాలనా భవనం సమావేశ హాలులో విసి అధ్యక్షతన రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జెఎన్‌టియు, ఆర్టీఓ విభాగాలు సంయుక్తంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా వివిధ రకాల రోడ్డు ప్రమాదాలు గురించి వివరిస్తూ ముఖ్యంగా యువతకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపరవాణా కమిషనర్ శివప్రసాద్, ఆర్టీఓ సురేష్‌నాయుడు పి.ఆర్.భానుమూర్తి, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, రవాణా శాఖ అధికారులు ఎ.వి.రమణారెడ్డి, వెంకటేష్‌నాయక్, యూనివర్సిటీ అధికారులు బి.చంద్రమోహన్‌రెడ్డి, వర్సిటీ పిఆర్‌ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి, బీమా అధికారులు నళినీకాంత్, ఎర్రిస్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు విసి రంగజనార్ధనను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

జిల్లా కోర్టులో పోతుల నాగరాజు ప్రచారం

అనంతపురం కలెక్టరేట్ : ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగుల పక్షాన శాసనమండలిలో ప్రశ్నించడానికి తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు కోరారు. ఈమేరకు సోమవారం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు, ప్రజలు, తదితర కక్షిదారులను కలిసి కరపత్రాలు పంచుతూ ప్రచారి నిర్వహించారు. కోరారు

అభివృద్ధికి అందరూ సహకరించాలి

కళ్యాణదుర్గం : మున్సిపాలిటి పరిధిలో జరుగుతున్న అభివృద్ధికి అందరూ సహకరించాలని కమిషనర్ వెంకటేశులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వైస్‌ఛైర్మన్ జయం ఫణీ, పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, తాగునీటి సమస్య, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు ఛైర్మన్ స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

రాయదుర్గం : పట్టణంలోని కోటలో ఉన్న నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మాహర్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ప్రధాన వీధుల్లో కళాశాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పాలాభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్ సారథ్యం వహించారు.

చైతన్యయాత్ర పోస్టర్ విడుదల

రాయదుర్గం : పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఫిబ్రవరి 17న నిర్వహించనున్న బహుజన చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాయదుర్గం అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఉలిగప్ప మాట్లాడుతూ రాయదుర్గం నుంచి బహుజన కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లి బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల అధ్యక్షులు నాగరాజు శ్రీరామ్, మహిళా అధ్యక్షురాలు గంగమ్మ, మారెప్ప, మల్లి, బాంసెఫ్, ఎంప్లాయిస్ కొల్లాప్ప, ప్రసాద్, ఆనంద్, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాల సమస్యకు పరిష్కారం

ఉరవకొండ : మేజర్ పంచాయతీలో ఐదు రోజులుగా వెలగని వీధి దీపాల సమస్య పరిష్కారమైంది. వీధి దీపాలకు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆ శాఖ ఎస్ఈని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించినట్టు సర్పంచి లలిత తెలిపారు. విద్యుత్ బకాయిలు కారణంగా ఉరవకొండ మేజర్ పంచాయతీకి ఐదు రోజుల క్రితం అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఉరవకొండ పట్టణంలో అంధకారం నెలకొంది. ప్రజల ఇబ్బందులను గమనించిన సర్పంచి విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు సర్పంచి, ఉపసర్పంచి వన్నప్ప, వార్డు సభ్యులు అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను కలిశారు. వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో 15వ ఫైనాన్స్ నిధులు వస్తాయని విద్యుత్ బకాయిలు జమచేస్తామని చెప్పారు. స్పందించిన కేతన్ గార్గ్ విద్యుత్ శాఖ ఎస్ఈతో ఫోన్లో మాట్లాడారు. వీధి దీపాలకు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.

పరిహారం ఇవ్వకుండా భూములు, ఇళ్లు తీసుకోవద్దు

◆ 2023 ధరల మేరకు చెల్లించాలి
◆ లేకుంటే బాధితులకు అండగా పోరాటం
◆ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు
◆ కలెక్టరేట్ ఎదుట 544-డి నిర్వాసితుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నిర్వాసిత గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న వి.రాంభూపాల్)

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పాముమరాయి నుంచి రోటరీపురం మీదుగా బోగసముద్రం వరకు ఏర్పాటు చేస్తున్న 544-డి జాతీయ రహదారికి అనుకుని ప్రజలు నివసిస్తున్న ఇళ్లు, భూములకు 2023 ధరల మేరకు న్యాయమైన పరిహారం ఇచ్చిన తరువాత వాటిని తీసుకుని పనులను చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పరిహారం విషయంలో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ 544-డి రోడ్డు భూ నిర్వాసితులు, రైతుసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు వి.శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 544 డి రోడ్డు పాముమరాయి నుంచి గుంటూరు వరకు 417 కిలోమీటర్ల మేర నిర్మాణ జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో భోగసముద్రం వరకు 69 కిలోమీటర్ల మేర జరుగున్న రోడ్డు నిర్మాణంలో 65 ఎకరాల భూమి, 400 ఇళ్లను ప్రజలు నష్టపోతున్నారని చెప్పారు. ఈ పనుల కోసం 2017లో నోటిఫికేషన్ విడుదల చేసి, 2019లో భూములు, ఇళ్లకు నష్టపరిహారం రేటు నిర్ణయించారన్నారు. 2019లో పరిహారం ఇవ్వలేదన్నారు. 2023లో 2019 ధరల ప్రకారం పరిహారం ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో సెంటు భూమి రూ.60 వేలు ఉండేదని, ఇప్పుడు రూ.3 లక్షలకు పైబడి పెరిగిందన్నారు. పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకోకుండా పాత రేట్లతోనే పరిహారం ఇస్తామనడం సరికాదన్నారు. ప్రస్తుతం ఇళ్లు కోల్పోతున్న వారు మళ్లీ ఇళ్లు నిర్మించుకోవాలంటే నాలుగింతలు వ్యయం పెరుగుతుందన్నారు. అధికారులు, ప్రభుత్వం దీనిని గుర్తించి రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన ప్రజలకు 2023 ధరల ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పరిహారంతో పాటు 5 సెంట్ల స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపోతున్న భూములు, ఇళ్లకు పరిహారం మూడు రెట్లు పెంచి ఇవ్వాలన్నారు. అలాకాదని 2019 రేట్ల ప్రకారం పరిహారం ఇస్తామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ఇళ్లు కూడా అనవసరంగా కూల్చకుండా రోడ్డుకు అవసరమైన మేర మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ సమస్యలపై అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌లోకి నాయకులు బయేల్దారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో మధుసూదన్ నేరుగా ధర్నా శిబిరం వద్దకు వచ్చి నాయకులతో మాట్లాడి, ప్రజల అర్జీలు స్వీకరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామంటూ హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ధర్నా విరమించారు. ఈ ధర్నాకు ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మద్దతు తెలిపి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు కుళ్ళాయప్ప, శ్రీనివాసులు, తాడిపత్రి రాజారామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రోటరీపురం రత్నమ్మ, నాగరాజు, కొర్రపాడు లక్ష్మినారాయణ, నారాయణస్వామి, మునెప్ప, శ్రీపురం వెంకటేశులు, వెంకటరాముడు, బండమీదపల్లి నాగరాజు, మునెమ్మ, సావిత్రమ్మ, నాయినపల్లి క్రాస్ న్యాయవాది రవి, దౌలా, రామక్రిష్ణ, నాయినపల్లి రామాంజినేయులు, గంగాధర, నాగమణి, ముచ్చుకోట గోపాల్‌రెడ్డి, బుగ్గ, కొండాపురం, ఎర్రగుంట్లపల్లి నిర్వాసితులు పాల్గొన్నారు.

వేతనాలు ఇస్తారా.. సమ్మె చేయమంటరా..?

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్‌లో అవకతవకలు, ఇఎస్ఐ వంటి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని తాగునీటి పథకం కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు తిప్పేస్వామి, మక్బుల్‌బాషా, కోశాధికారి శ్రీరాములు, ఉపాధ్యక్షులు ఆంథోనిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నవంబర్‌లో తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సమ్మె విరమింపజేశారని గుర్తు చేశారు. ఇంత వరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులకు డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. అప్పులు కూడా పట్టని పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. పిఎఫ్‌లో నెలకొన్న అవకతవకలు సరిచేయాలన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 1వ తేది నుంచి దశల వారీగా నిరసనలు, ఫిబ్రవరి 15 నుంచి నిరవదిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

జేసీ కేతన్‌గార్గ్‌కు శ్రీసత్యసాయి తాగునీటి కార్మికుల వినతి

జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ కొనసాగించాల్సిందే..

మైనార్టీల విద్యాభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న స్కాలర్‌షిప్‌లను యథావిధంగా 1 నుంచి 10 తరగతుల వరకు కొనసాగించాల్సిందేనని ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముష్కిన్, నగర అధ్యక్షులు మసూద్, ఇన్సాఫ్ కార్యదర్శి బంగారు బాషా, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు 9, 10 తరగతులకు వారికే స్లార్‌షిప్ ఇస్తామనడంతో మైనార్టీ వర్గాలు తీవ్ర ఆందోళన పడుతున్నాయన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి చదువుతున్న మైనారిటీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉప కార వేతనాలను నిలిపివేయడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న 1,24,775 మందికి పథకం నిలిపివేసిందన్నారు. గతేడాది వరకు ఉపకార వేతనం పొందుతూ వచ్చిన మరో 1,23,825 మందికి ఇక అందవని మొత్తంగా 2,48,600 లక్షల మందికి మొండిచేయి చూపిందన్నారు. ఒకసారి ఉపకార వేతనం మంజూరైన విద్యార్థులు పదో తరగతి వరకూ ఏటా దరఖాస్తును రెన్యువల్ చేసుకునే వెసులుబాటు ఉండేదన్నారు. అయితే ఈ ఏడాది నుంచి ఎనిమిదో తరగతిలోపు విద్యార్థులకు ఉపకార వేతనం నిలిపివేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఒకటి నుంచి ఎనిమిది తగరతి వరకు విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్య కింద మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, విద్య అందిస్తున్నందున ఉపకార వేతనాలు ఇవ్వకూడదని నిర్ణయించామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకే ఉపకార వేతనం ఇస్తామని రాష్ట్రాలకు సమాచారం ఇచ్చిందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఇర్ఫాన్, ఇస్మాయిల్, శర్మాస్, లాలు, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇవ్వాలని భిక్షాటన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

బకాయి వేతనాలు, హెల్త్ అలవెన్స్, ఇఎస్ఐ, ఇపిఎఫ్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని అనంతపురం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో చనిపోయిన పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణంలో మట్టి పాత్రలు పట్టుకుని బిక్షాటన చేసి నిరసన తెలిపారు. వారికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర న్యూ టౌన్ అధ్యక్షులు గురురాజా ఓల్డ్‌టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ, డెత్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, పెన్షన్ వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికులకు 2021 జనవరి నుండి 2023 జనవరి వరకు బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి సలెండర్ లీవులు, యూనిఫాం, కుట్టుకూలి, పనిముట్లు, రక్షణ పరికరాలు, డిఎ, ఇఆర్, ఇంక్రిమెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలోనే మస్టర్ తీయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. అదనపు పని గంటలకు ఓటితో కలిపి వేతనం ఇవ్వాలన్నారు. ఎంఎంఆర్ కార్మికులకు డిఎ, ఐఆర్‌తో పాటు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. మలేరియా, కోవిడ్, గార్బేజ్, క్లాప్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలన్నారు. నగర జనాభాకి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కోశాధికారి తిరుమలేశు, సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, మహిళా కన్వీనర్ మంత్రి. వరలక్ష్మి, కమిటీ సభ్యులు ఆది, శ్రీనివాసమూర్తి, నాగేంద్ర, రామంజి, ఎర్రిస్వామి, లక్ష్మన్న, దేవరాజు, కార్మికులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబాలు

చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిన్నారులకు దుస్తులు పంపిణీ

నార్పల : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని నార్పల మండల కేంద్రానికి చెందిన టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయి అనాథాశ్రమంలోని చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. మిఠాయిలు అందజేశారు. స్థానిక సెవెన్ హిల్స్ కళ్యాణ మండపంలో కేక్ కట్‌చేసి టిడిపి కార్యకర్తలు, అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీన నారా లోకేష్ మొదలుపెట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, ప్రతాప్ చౌదరి, సాలెహా, గంజికుంట ప్రభాకర్, ఆకుల కిషోర్, నరసాపురం శివకష్ణ, శ్రీరాములు, గూగూడు నరసింహులు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పెద్దవడుగూరు : సిపిఎం నేత జెడ్ వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి తెలిపారు. కర్నూలులోని శాంతారాం కంటి ఆసుపత్రి వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెసిఎస్ ఇన్‌ఛార్జిగా పసులూరు బయపరెడ్డి

బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల జెసిఎస్ ఇన్‌ఛార్జిగా పసులూరు బయపరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా బయపరెడ్డి ఆలూరు రమణారెడ్డి స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బయపరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జెసిఎస్ ఇన్‌ఛార్జిగా నియమించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు సాయశక్తులా కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నీలం భాస్కర్, ముత్యాల రంగనాథ్ రాయల్, చికెన్ నారాయణస్వామి, బండి పురుషోత్తం, నందినేని మల్లికార్జున, సాకే లక్ష్మీనారాయణ, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, జంతులూరు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బెస్త సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఉరవకొండ : బెస్తలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, అన్ని రంగాలలో చేయూతనిచ్చి వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కెవి.రమణ పేర్కొన్నారు. సోమవారం విడపనకల్ మండల కేంద్రంలో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశం అధ్యక్షుడు తిప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, నియోజకవర్గ అధ్యక్షులు తిప్పయ్య మాట్లాడుతూ.. బెస్తలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. భవిష్యత్తులో బెస్తలకు రాజకీయ ప్రాథమిక కల్పించకపోతే బుద్ధి చెబుతామన్నారు. బెస్తలు కులవృత్తిని కోల్పోయి పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. వలసలు పోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, మహిళా నాయకురాలు రాజేశ్వరి, గోవప్ప, వెంకటేష్, ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, రామన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

విడపనకల్లు మండల అధ్యక్షులుగా జానకి నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా పంపాపతి, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులుగా రవి, నాగరాజు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన 49 మందిని బెంగళూరుకు పంపారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర మాజీ నాయకులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర మాజీ నాయకులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. గుత్తి ఆర్ఎస్ లోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సాయంత్రం రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మాజీ రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ రైల్వే సంస్థలోని కాంట్రాక్టు వ్యవస్థతో కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. దేశంలో 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ రకాల పనులను పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఏటా లక్షలాది రూపాయలు రైల్వే సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టటంలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర అధికంగానే ఉందన్నారు. కానీ కాంట్రాక్టర్స్ ఎవరూ కూడా కార్మిక చట్టాలను వేటినీ అమలు పరచకుండా కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వ జిఒ ప్రకారం కనీసవేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా కార్మికులను పనుల్లో కొనసాగనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, సెలవులు, మస్టర్ రికార్డులు, పేస్లిప్పులు తదితర చట్టపరమైనవేవీ అమలు పరచకుండా కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడం వల్ల కార్మికులు అనేక విధాలుగా నష్టపోతున్నారని చెప్పారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. కార్మిక చట్టాల మార్పు, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను, రైల్వేలతో సహా ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు విక్రయించడం, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో వాటి ప్రభావం రైల్వే రంగంపై పడిందన్నారు. పర్మినెంట్ సిబ్బంది సంఖ్యను 40 శాతం తగ్గించటంతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను కూడా 25 శాతం నుండి 50 శాతం వరకు తగ్గించాలని ఆర్డర్స్ జారీ చేయడం వల్ల అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులు పనులు కోల్పోయి ఉపాధి దెబ్బతింటోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కసాపురం రమేష్, గుత్తి మండల అధ్యక్షుడు ఎం మల్లేష్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగా, మురళి, గౌరవాధ్యక్షులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి వి.రాంభూపాల్

ఉప ప్రణాళిక చట్టం కొనసాగింపు హర్షణీయం

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని కొనసాగిస్తూ జిఒ 7ను జారీ చేయడం హర్షణీయమని కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి జగ్గలి రమేష్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగంలో ఉప ప్రణాళిక చట్టం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశం నిర్వహించిన సమావేశంలో జగ్గలి రమేష్ మాట్లాడుతూ కెవిపిఎస్ 195 ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు చేసి అసెంబ్లీ వద్ద నిరాహార దీక్షలు చేసి అనేక పోరా టాలు చేసిన ఫలితంగా ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం 2013లో ఇచ్చిందన్నారు. ఆ చట్టానికి కాలపరిమితి ఉన్నందున అది జనవరి 2023 నాటికి ముగుస్తున్నందున ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తూ జిఒ 7 జారీ చేసిందన్నారు. కెవిపిఎస్ దళిత ప్రజా సంఘాలను కలుపుకుని ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా అమలు చేసేందుకు ఆర్డినెన్స్ తెచ్చేందుకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ ఆర్డినెన్స్ అసెంబ్లీలో చట్ట రూపంలో తీసుకొని రావాలని అదే సమయంలో పాత చట్టంలో ఉన్న లోపాలను సరిదిద్ది నిర్ణీత గడువు నిమిత్తం లేకుండా ఈ చట్టం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎరుకల గంగన్న, లక్ష్మన్న, చంద్రశేఖర్, పుల్లన్న, రంగప్ప, ప్రతాప్, రంగస్వామి, రాముడు, మద్దిలేటి, ఎరుకుల నాగరాజు, అన్వేష్, రంగ నాయకులు పెద్ద గంగన్న, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

వాహన దారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక పరిటాల కల్యాణ మండపంలో విద్యార్థులకు, వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి యు.నరసింగప్ప, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ శివరామకష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారుల నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని అన్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు జరుగవన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా ఉంటారని అది సరికాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగం అనర్థాలకు కారణమన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ నైరుతి రెడ్డి, సిఐ లు రామసుబ్బయ్య, గణేష్, ఎస్ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పట్టణంలోని 31వ వార్డులో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలోని ఎన్నికల వార్డు 31లో గతంలో వేసిన రోడ్లు శిథిలం అయ్యాయన్నారు. వాటి స్థానంలో కొత్త రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, వార్డు బాధ్యులు షాషావలి, తిమ్మప్ప, చందు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంక్షేమమే ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ధ్యేయం

శ్రీ సత్యసాయి ఎంటర్ ప్రైజెస్ ఇండేన్ గ్యాస్ మేనేజర్ నరేంద్ర కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

వినియోగదారుల సంక్షేమమే ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ధ్యేయమని శ్రీ సత్యసాయి ఎంటర్ ప్రైజెస్ ఇండేన్ గ్యాస్ మేనేజర్ నరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఇండేన్ గ్యాస్ వినియోగదారులకు ప్రమాద రహితంగా, అతి తక్కువ బరువుతో, గ్యాస్ సిలిండర్‌లో ఎంత వినియోగం అయిందో కనపడే విధంగా అపారదర్శన్ గ్యాస్ సిలిండర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం ఉరవకొండలోని చిట్టా కాలనీలో గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండేన్ గ్యాస్ వినియోగదారులకు మరింత భద్రతా ప్రమాణాలతో ఫైబర్ అపారదర్శన్ సిలిండర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. అప్పటి వరకు వినియోగించే సాధారణ సిలిండర్ 35 కేజీల బరువు ఉండడంతో పురుషుల సహకారాన్ని మహిళలు తీసుకోవాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన అపారదర్శన్ సిలిండర్ బరువు కేవలం 10 కేజీలు మాత్రమే ఉంటుందన్నారు. మహిళలు, వృద్ధులు పిల్లలు తీసుకొచ్చేందుకు, మార్చడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ నూతన గ్యాస్ సిలిండర్లు ప్రమాదాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. 2027 వరకు సిలిండరును వినియోగదారులు వాడేవిధంగా ఫైబర్‌తో తయారు చేశామని చెప్పారు. ఈ సిలిండర్ ధర రూ.3500 అని చెప్పారు. కొత్త సిలిండర్ కావాలనుకునేవారు పాత సిలిండర్ కోసం కట్టిన డిపాజిట్ పోను మిగిలింది చెల్లించి తీసుకోవచ్చని తెలిపారు. శ్రీ సత్యసాయి ఎంటర్‌ప్రైజెస్ ఇండేన్ గ్యాస్ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వ

బుక్‌లెట్లు అందజేస్తున్న జెడ్‌పిఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-బెలుగుప్ప

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బెలుగుప్ప మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ..గత ఏడాది బెలుగుప్ప మండలానికి రూ.24.64 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షం నాయకులు, ఎల్లో మీడియాను వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. బురదజల్లడం మానుకోవాలని హితవుపలికారు. చంద్రబాబు కుమారుడు లోకేష్ బాబు పాదయాత్ర చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీపీ పెద్దన్న, సహకార సంఘం అధ్యక్షుడు బి.శివలింగప్ప నాగిరెడ్డి, కన్వీనర్ శ్రీనివాసులు, ఆవులన్న సహకార సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసులు, రామాంజనేయులు, కరుణాకర్ బాబు రెడ్డి, శ్రీరంగపురం మారుతి రెడ్డి, వెంకట్ రెడ్డి, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, మచ్చుప్ప రమినేపల్లి సర్పంచి రమేష్, అనిల్, సర్పంచ్ సాలిబాయి గంగ్యాస్ నాయక్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కళ్యాణదుర్గం-రాయదుర్గం జాతీయ రహదారిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గంకు చెందిన గోపాల్, తిమ్మరాజు, అరవింద్ సొంత పనుల మీద ద్విచక్రవాహనంలో రాయదుర్గం మండలం గొడుసుపల్లి గ్రామానికి బయలుదేరారు. బ్రాహ్మణపల్లి సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని 108 సాయంతో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఛీటింగ్ కేసులో పరారైన వ్యక్తి అరెస్టు

ఆత్మకూరు : ఓ ఛీటింగు కేసులో 12 సంవత్సరాలుగా కోర్టుకు హాజరు కాకుండా తెలంగాణలో తలదాచుకుంటున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఆత్మకూరు ఎస్ రంగడు యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల పట్టణానికి చెందిన మహీంద్రరావు అనంతపురం జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్యలో అకౌంటెంటుగా పనిచేసేవాడు. సమాఖ్యకు చెందిన రూ.7,12,784 లు డ్రా చేసుకుని వాడుకున్నాడు. సమాఖ్య అధ్యక్షురాలు సమంత ఫిర్యాదు మేరకు మహీంద్రరావుపై 12-05-2009 ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసుకు సంబంధించిన ట్రైల్స్‌కు నిందితుడు హాజరు కాకపోవడంతో 24-10-2011 తేదీన అనంతపురం ఎజెఎఫ్‌సిఎం కోర్టు వారు ఎన్‌బిడబ్ల్యు జారీ చేశారు. దీర్ఘకాలంగా కేసు పెండింగులో ఉంది. ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు పోలీసులు మహీంద్రరావును సోమవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు.

ఎద్దులు, ఆవులు చోరీ

నార్పల : బొందలవాడ గ్రామానికి చెందిన చిన్న నాగప్ప, శంకర్, చిన్నయ్య అనే రైతులకు సంబంధించిన 4 ఎద్దులు, మూడు ఆవులను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్పల ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉరవకొండ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. కార్డియాలజీ, ఆర్థో, స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధించిన దాదాపు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి సవేరా ఆస్పత్రికి రెఫర్ చేశారు. చందా కేశన్న, కొమ్మసాని బాలచంద్ర, సప్తగిరి మల్లికార్జున ఉచిత భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నజీర్, క్లబ్ సభ్యులు సి.నాగేశ్వరరావు, గణేష్ బాబు, సురేంద్ర, బాలచంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

గుత్తి : భవిత కేంద్రాలలో దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు సమగ్ర శిక్ష సహాయ ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిలక్ విద్యాసాగర్, అనంతపురం జిల్లా ఐఆర్‌టి కోఆర్డినేటర్ షమా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు ఇచ్చేందుకు ఎంపిక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో సుమారు వందమంది దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమగ్ర శిక్ష ఎపిసి తిలక్ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన దివ్యాంగ విద్యార్థులకు వీల్‌ఛైర్ స్టాండ్,మూడు చక్రాల సైకిల్ దివ్యాంగులకు సంబంధించి ఇతర ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. శిబిరాలలో తల్లిదండ్రులు తమ వికలాంగ పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా పంపిణీ చేసే ఉపకరణాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.రవి నాయక్, ఐఇఆర్టీలు పాల్గొన్నారు.

జిబిసి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని వినతి

ఉరవకొండ : విడపనకల్ మండలం పరిధిలోని జిబిసి కెనాల్‌కు ఫిబ్రవరి 15వ తేదీ వరకు సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని వైసిపి నాయకులు పంపాపతి ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని కోరారు. గుంతకల్ బ్రాంచ్ కెనాల్ ఆయకట్టులో పంటలు సాగు చేస్తున్న రైతులు విజయవాడలో ఉన్న ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డికి ఫోన్‌చేసి తమ సమస్యను వివరించారు. మిరప పంటకు నల్ల తామర సోకడంతో సమయానికి పంట దిగుబడి రాలేదన్నారు. మరికొన్ని రోజులు సాగునీరు అందించాలన్నారు. ఫిబ్రవరి 15వ వరకు సాగునీరు సరఫరా చేస్తే మిరప పంటతో పాటు ఇతర పంటలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతుల సమస్యలను ఎమ్మెల్సీ వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు మేలు చేకూరేలా కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

అనంతపురం కార్పొరేషన్ : జననం తప్ప మరణం లేని మహోన్నత నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ మాత్రమేనని నగర మేయర్ మొహమ్మద్ వసీం కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ వసీం నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్ రెడ్డి, ఎస్ఈ నాగమోహన్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డిఈ నరసింహులు, ఎసిపి సువర్ణ, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, సంపంగి రామాంజినేయులు, అబూసాలెహా, సుజాత, లాలూ పాల్గొన్నారు.

గుత్తి : పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కె. అబూబకర్, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, షేక్షావలి, రాముడు, అబ్దుల్ పాల్గొన్నారు. స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి జెవివి, సుభాష్ చంద్రబోస్ కమిటీ నాయకులు పూలమాలేసి నివాళులర్పించారు. జెవివి జిల్లా నాయకులు, శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు, సుభాష్ చంద్రబోస్ కమిటీ నాయకుడు నిజామొద్దీన్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో టిడిపి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అనంతపురం అర్బన్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తనయుడు టిడిపి యువజన నేత మధుకర్ చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మధుకర్ చౌదరి మాట్లాడుతూ యువ నాయకుడు నారా లోకేష్ నిండు నూరేళ్లు ఆయుర్ ఆరోగ్యాలతో జీవించాలన్నారు. రాష్ట్ర ప్రజల కోసం చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. టిడిపిని అధికారంలోకి తేవడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవర్ల మురళి, నాగరాజు, సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, బుల్లె శివబాల, సుధాకర్ యాదవ్, శ్రీనివాస్ చౌదరి, తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర నాయకులు స్వప్న, తేజస్విని, కంత దేవి, విశాలాక్షి, వసుంధర, కష్ణవేణి, జానకి, వరాలమ్మ, వెంకటలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కడవకల్లు గ్రామంలో టిడిపి నాయకుడు గోవర్ధన్ రాజు స్వగృహంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెర్లోపల్లి రవీంద్ర నాయుడు, శ్రీనివాస నాయుడు, చింతకుంట సాంబశివుడు, మునిరాజు, రామాంజినేయులు, వెంకటనాయుడు, ముప్పారపు నాయుడు, బాయినేని ప్రసాద్, మల్లికార్జున, నాగప్ప, కుళ్లాయప్ప, లింగమయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో రోగులకు బ్రెడ్డు అందజేత

శింగనమల : నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రావణీశ్రీ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు బీసీ బాబు, మండల కన్వీనర్ గుత్తు ఆదినారాయణ అధ్యక్షతన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, చిదానంద నాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, నెట్టికంటి సత్యనారాయణ, ఓబుళపతి, ఎర్రిస్వామి, సుదర్శన్ నాయక్ టిడిపి మాజీ ఎంపిటీసీ మల్లికార్జున, వెంకటనారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరులో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

నార్పల : నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆలం నరస నాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో నార్పల మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లోకేష్ బాబు యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు రాఘువ నాయుడు, వెంకటేశ్వర నాయుడు, చంద్రబాబు, నాగేంద్ర, పిఎల్.లక్ష్మీనారాయణ, పిట్టు రంగారెడ్డి పాల్గొన్నారు.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT-Tender Notice.

1	Tender Notice No.	606/22-23 to 610/22-23/CMDF/TO
2	Scope of Work	CC Roads & Drains & Construction of Community Hall
3	Estimate Cost Ranging	Rs.3.35 to Rs.25.00 Lakhs
4	Tender Notice No.	611/22-23 to 634/22-23/GF/TO
5	Soope of Work	CC Roads & Drains, CC & BT Patches, Construction of Compound Walls, Construction of Footpaths. S & D of Liquid Chlorine, S&D of Copper Cable etc.,
6	Estimate Cost Ranging	Rs. 3.00 to 50.00 Lakhs
7	Tender Notice No.	635/22-23 to 650/22-23/15' FC/TO
8	Scope of Work	Construction of CC Roads, Drains & Culverts, S&D of JCB, Dust Bins
9	Estimate Cost Rangin	Rs. 8.50 to 81.89 Lakhs
10	Tender Notice No.	415/22-23 to 423/22-23/GGMP/TO
11	Scope of Work	CC Roads & Drains
12	Estimate Cost Ranging	Rs. 1.00 to 10.10 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market Place available @ **https://tender.apeprocurement.gov.in**

Commissioner
Municipal Corporation
Anantapuramu